




విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

కోర్టు నోటీసులతో.. కుట్ర'పన్ను'తున్నారు..!






- ఇంటి పన్నులు చెల్లించాలని గ్రామీణులకూ కోర్టు నోటీసులు
- పంచాయతీలకూ చేరిన బెదిరింపుల వ్యవహారం
- ముక్కుపిండి వసూళ్లు చేసేందుకు ప్రభుత్వం చర్యలు
- కోర్టు నోటీసులతో హడలెత్తుతున్న గ్రామీణ పేదలు

ప్రజల నుంచి ఇంటి, కొళాయి పన్నులను ముక్కుపిండి వసుళ్లు చేసేందుకు ప్రభుత్వం అన్ని అస్త్రాలను ఉపయోగిస్తోంది. ప్రజల ఇబ్బందులతో తమకేమి సంబంధం.. పన్నులు మాత్రం చెల్లించాల్సిందే అనేలా పేదలపై ఒత్తిడి పెంచుతున్నారు. ఇంత వరకు మున్సిపాల్టీల్లో మాత్రమే కన్పించే బలవంతపు పన్నుల వసూళ్లు ఇప్పుడు గ్రామాలకు వచ్చాయి. కోర్టు నోటీసుల పేరుతో గ్రామాల్లో పన్నుల వసూళ్లకు అధికారులు బెదిరింపు కుట్ర'పన్ను'తున్నారు. చిలమత్తూరు మేజర్ పంచాయతీలో పన్నులు చెల్లించని వారికి గత నాలుగు రోజులుగా కోర్టు నుంచి నోటీసులు అందుతున్నాయి. దీంతో పేదలు హడలెత్తిపోతున్నారు.

ప్రజాశక్తి-చిలమత్తూరు

గ్రామాల్లో ఉపాధి లేక ఇప్పటికే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిధుల లేమితో గ్రామాల అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పంచాయతీలకు ప్రభుత్వ నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు అందక పోవడంతో జనరల్ ఫండ్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి నెల్కొంది. దీని కారణంగా ఇంటి, కొళాయి పన్నుల వసుల్లే లక్ష్యంగా ప్రభుత్వం కోర్టు నోటీసులు పంపి ముక్కు పిండి వసుళ్లు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. గ్రామాల్లో ఎలాంటి అభివద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో సర్పంచులపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేఖత వ్యక్తం అవుతోంది. ఇదిచాలదన్నట్లు ఇంటి పన్నులు చెల్లించల్సిందేనంటూ ఏకంగా గ్రామాల్లో కోర్టు నోటీసులు అందించడంతో సర్పంచులు ప్రజల నుంచి మరింత వ్యతిరేకతను మూటకట్టు కుంటున్నారు. మరో వైపు



నోటీసు

ప్రీలిటిగేషన్ కేసు నెం. 72978 /2022

యజమాని పేరు	చిరునామా	పన్నుల బకాయి వివరములు	అస్సెస్మెంట్ నెం.	సంవత్సరము	మొత్తము రూ. (అరియర్ & కరెంటు)
Gangulappa	13-115, Maravakothapalli, Chilamathur, 515341	ఇంటి పన్నులు	2515	2021-2022 సం// వరకు	943

//By Oder//

K.V. Usha Sree
Superintendent
District Legal Services Auth
ANANTHAPURAMU

Dis.No.1954 Dt : 21/10/2022.

To :

శ్రీ Gangulappa,
13-115, Maravakothapalli,
Chilamathur,

చిలమత్తూరు మేజర్ పంచాయతీలో ఇటీవల ఓ గృహ వినియోగదారినికి ఇంటి పన్ను చెల్లించాలని పంచాయతీ అధికారులు పంపిన కోర్టు నోటీసు

మేజర్ పంచాయతీలే లక్ష్యం

గత వారం రోజులుగా చిలమత్తూరు మండల కేంద్రంలో ఇంటి, కొళాయి పన్నులు చెల్లించని వారికి కోర్టు నోటీసులను పంచాయతీ అధికారులు పంపుతున్నారు. మేజర్ పంచాయతీలకు లక్ష్యంగా చేసుకుని వీటిని పంపుతున్నారు. చిలమత్తూరు మండలంలో మొత్తం 12 పంచాయతీలు ఉండగా మేజర్ పంచాయతీగా ఉన్న చిలమత్తూరులో మొదటగా కోర్టు నోటీసుల జారీ తంతును మొదలు పెట్టారు. పంచాయతీలో 3470 అసెస్మెంట్‌లు ఉండగా 965 అసెస్మెంట్‌లకు నోటీసులు వచ్చాయి. వీటిని గత ఐదు రోజులుగా పంచాయతీ సిబ్బంది సంబంధిత గృహ యజమానులకు అందజేసి వారితో సంతకాలు సైతం తీసుకుంటున్నారు. ఆ నోటీసుల్లో ఇంటిపన్ను, కొళాయి పన్నులు చెల్లించని కారణంగా ఈ నెల 12 తేదీన కోర్టుకు హాజరు కావాలని పొందుపరిచారు. దీనిని చూసిన ప్రజలు పన్నులు చెల్లించకుంటే కోర్టుకు వెళ్లడం ఏమిటంటూ బెంబేలెత్తుతున్నారు.

వలసల కారణంగానే మొండి బాకాయిలు

ఉమ్మడి అనంతపురం జిల్లా కరువుకు పెట్టింది పేరు. అందులో చిలమత్తూరు మొదటి స్థానంలో ఉంది. ఓ వైపు ప్రభుత్వం సెజ్ పేరుతో బడుగు బలహీన వర్గాల భూములు లాగేసుకోవడం, వ్యవసాయం బాగ తగ్గిపోవడంతో ఇటు రైతు కుటుంబాలతో పాటు, వ్యవసాయ కూలీలు పక్కనే ఉన్న కర్నాటక ప్రాంతం బెంగుళూరుకి వలసలు వెళ్తున్నారు. వలస కుటుంబాలు ఇంట్లో లేకపోవడం ఉన్న వృద్ధుల వద్ద పన్నులు చెల్లించేంత స్థోమత లేక ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కోర్టు నోటీసులు ఇస్తుండడంపై సంబంధిత గృహ యజమానులు ఆందోళనకు గురవుతున్నారు.

కోర్టు నోటీసులతో భయపెట్టడం తగదు

పన్నుల వసూళ్ల కోసం ప్రజలకు కోర్టు నోటీసులు పంపి భయపెట్టడం దుర్మార్గం. ఇప్పటికే పేద, బడుగు, బలహీన వర్గాలపై అధిక పన్నుల భారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్నాయి. మూలిగే నక్కపైన తాటికాయ పడిన చందంగా పన్నుల వసూలుకు కోర్టు నోటీసులు పంపడం దారుణమైన చర్య. గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు కల్పనపై దృష్టి సారించకుండా ప్రభుత్వాలు పన్నుల వసూళ్లతో ఆదాయం పెంచుకోవాలని చూస్తున్నాయి. పేదలను భయభ్రాంతులకు గురి చేసేలా ఉన్న కోర్టు నోటీసులు పంపే ప్రక్రియను తక్షణం నిలుపుదల చేయాలి. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తాం.

ఫిరంగ ప్రవీణ్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు.

ఉపాధ్యాయురాలిగా మంత్రి

పిల్లలకు పాఠాలు బోధించిన ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్ ఉపాధ్యాయురాలిగా మారారు. శనివారం నాడు కళ్యాణదుర్గం పట్టణం కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరో తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్‌లో పాఠాలు బోధించి, విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. బోర్డుపై పాఠాలు బోధించి కాసేపు ఉపాధ్యాయురాలిగా మారారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రయివేటు ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దుతున్నారని మంత్రి విద్యార్థులకు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు పాఠశాలలు అన్నారు. ప్రతి విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచిచూశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠశాలలో అభివృద్ధి పనుల పరోగతిని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువగా ప్రభుత్వ వైద్యసేవలు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ వైద్యసేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా వైద్య సిబ్బంది పని చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సూచించారు. కలెక్టర్ అధ్యక్షతన శనివారం నాడు వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ భవనంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు, చేరుకోవాల్సిన లక్ష్యాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి వివరించారు. ఆన్లైన్ ద్వారా పంపుతున్న అన్ని రిపోర్ట్స్ 100 శాతంగా ఉండాలని అన్నారు. గర్భిణులకు అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్నారు. బాలింతల ఇంటి వద్దకెళ్లి తల్లీ బిడ్డ ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి మాతత్వ యోజన, జననీ సురక్ష యోజన కార్యక్రమాల్లో లబ్ధిదారులను గుర్తించి వారికి అందాల్సిన పారితోషికం సకాలంలో అందించాలని పేర్కొన్నారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల సర్వే వేగవంతం చేయడానికి దష్టి పెట్టాలని తెలిపారు. ఆరోగ్య శ్రీ వైద్యం పొంది ఇంటి వద్ద ఉన్న వారిని కుటుంబ డాక్టర్ విధానం కార్యక్రమం ద్వారా వైద్యాధికారులు నేరుగా పరీక్షించాలని తెలిపారు. ప్రతి గురువారం ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే ఐరన్ మాత్రల పంపిణీ కార్యక్రమం సక్రమంగా నిర్వహించాలన్నారు. సీజనల్ వ్యాధుల్లో దోమల ద్వారా సంక్రమించే జ్వరాలను గుర్తింపు సర్వే నిర్వహించి దోమల నివారణకు స్థానిక సర్పంచుల ద్వారా ఫాగింగ్ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మాతమరణాలు శిశు మరణాల రేటు తగ్గించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహణ వంద శాతం ఉండాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥విశ్వనాథయ్య మాట్లాడుతూ స్వచ్ఛభారత్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహార సమతుల్యత, నులిపురుగుల నివారణ కార్యక్రమాల నిర్వహణ వంద శాతం ఉండాలన్నారు. డిఐఒ డా॥యుగంధర్ మాట్లాడుతూ ఆన్లైన్ వివరాల నమోదులో వంద శాతం లోపు ఉన్న ఆరోగ్య కేంద్రాలను సమీక్షించి వాటికి గల కారణాలను తెలుసుకుని త్వరితగతిన వివరాల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ డా॥కష్ణవేణి, ప్రోగ్రాం అధికారులు డా॥సుజాత డా॥చెన్నకేశవులు, డా॥నారాయణస్వామి, డెమో భారతి, డిప్యూటీ డెమో త్యాగరాజు, మలేరియా నివారణ అధికారి ఓబులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుందాం

డిఐజి రవిప్రకాష్



డిఐజి రవిప్రకాష్

ప్రజాశక్తి-అనంతపురం

ఈ నెల12వ తేదీన జరిగే లోక్ అదాలత్ కార్యక్రమంలో వివిధ రకాల కేసులన్నింటినీ రాజీమార్గం ద్వారా పరిష్కరించుకునేలా దానిని సద్వినియోగం చేసుకోవాలని డిఐజి రవిప్రకాష్ పోలీసు సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం ఆయన అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో విచారణలో ఉన్న 7800 కేసులు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 13 వేల కేసులను ఈ నెలాఖరుకల్లా 80 శాతం తగ్గించాలన్నారు. ఈ కేసుల్లో అరెస్టులు, దర్యాప్తులు పెండింగ్‌లో ఉంటే త్వరితగతిన పూర్తి చేసి ఛార్జిషీట్లు వేయాలన్నారు. అనంతపురం జిల్లాలో ఉన్న 2 వేల ఎక్సైజ్ కేసులు, శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్న 5,600 ఎక్సైజ్ కేసులను తగ్గించాలన్నారు. కేసులను ఎస్పీలు సమీక్ష చేసి సీజ్ చేసిన వాహనాల డిస్పోజల్‌లో సంబంధిత పోలీసు అధికారులు చట్టపరంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉభయ జిల్లాలో 350 వరకు మిస్సింగ్ కేసులు ఉన్నాయని, వీటిలోనూ పురోగతి పెంచాలన్నారు. వచ్చే నెలలో జరుగనున్న లోక్‌అదాలత్ కేసులు పరిష్కారం అయ్యేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీలు డా॥ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్‌తో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా డీఎస్పీలు, సిఐలు పాల్గొన్నారు.

నేడు ఆవాజ్‌నగర మహాసభలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆవాజ్ నగర మహాసభలు ఆదివారం నాడు అనంతపురం నగరంలోని జిల్లా పరిషత్ సమావేశం మందిరం పైహాలులో నిర్వహిస్తున్నట్లు ఆసంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు మసూద్, వలి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీలపై బిజెపి పాలనలో దాడులు, హిజాబ్, మైనార్టీ స్థితిగతులు, కేంద్రం అవలంభిస్తున్న మతోన్మాద విధానాలు, రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలు తదితర వాటిపై మహాసభ వేదికగా చర్చించి, భవిష్యత్తు కార్యక్రమాలను సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని ముస్లిం మైనార్టీలు అందరూ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు బాబు, ఇర్ఫాన్, షర్మాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ కొనసాగించాలి

సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

పోరాడి సాధించుకున్న హెల్త్ అలవెన్స్‌ను యథావిధిగా కొనసాగించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సిఐటియు నాయకులు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఆవరణలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ఓల్డ్‌టౌన్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగభూషణం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనంతో సంబంధం లేకుండా ఇస్తున్న హెల్త్ అలవెన్స్‌ను వివిధ కారణాల వల్ల ట్రెజరీ, సిఎఫ్ఎంఎస్ అధికారుల ద్వారా తిరిగి హెల్త్ అలవెన్స్‌ను రికవరీ చేయాలని మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు జారీ చేయడం బాధాకరమన్నారు. కార్మికులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాన్ని ఆపాలని, హెల్త్ అలవెన్స్‌ను కొనసాగించాలని కోరారు. అలాగే రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న రెండు సంవత్సరాల సరెండర్ లీవులు, యూనిఫాం, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమిస్కిల్డ్ వేతనాలు అమలు చేస్తూ, హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మికులందరికీ సకాలంలో పనిముట్లు, రక్షణ పరికరాలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వీరికి మిత్ర సంఘాల కమిటీ సభ్యులు ముత్తురాజు, సర్దానమ్మ, దేవరాజు, వెంకటేష్, ఇంజనీరింగ్ సెక్షన్ కమిటీ సభ్యులు జీకే.లోకేష్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు బండారు ఎర్రిస్వామి, కోశాధికారి తిరుమలేశు, సహాయ కార్యదర్శి బత్తల ఆదినారాయణ, సలహాదారు శేషేంద్రకుమార్, రాష్ట్ర, జిల్లా, నగర మహిళా కన్వీనర్లు లక్ష్మీదేవి, లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, కమిటీ సభ్యులు నాగేంద్ర, కిరణ్, శ్రీనివాసమూర్తి, మంజుల, గీతమ్మ, ఎర్రిస్వామి, అరుణమ్మ, రాఘవేంద్ర ప్రసాద్, ఆంజనేయులు, నల్లప్ప, ఆదినారాయణ, ఇమాంబి, జయరాం, రవి, రామాంజి, రేణుక, శివ, ప్రభాకర్ , శివేంద్ర కుమార్, గంగాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గం పురపాలక సంఘంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాల నుంచి హెల్త్ అలవెన్స్ రికవరీ చేయడాన్ని వెంటనే నిలుపుదల చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి కార్మికులు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లికార్జున మాట్లాడుతూ సిఐటియు చేసిన పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల హెల్త్ అలవెన్స్ యథావిధిగా చెల్లిస్తామని ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పది నెలల హెల్త్ అలవెన్స్‌ను వేతనాల నుంచి రికవరీ చేయాలని పురపాలక సంఘాలకు ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి హెచ్.రాము, వెంకటేశులు, చంద్ర, అజీజ్, ఎర్రిస్వామి, శ్రీనివాసులు, కొల్లప్ప పాల్గొన్నారు.



అనంతపురంలో కమిషనర్ భాగ్యలక్ష్మికి వినతిపత్రం సమర్పిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

గుంతకల్లు : పారిశుధ్య కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నాయకులు కసాపురం రమేష్, ఈశ్వరయ్య, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు కె.నరసయ్య మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కమిషనర్ నిర్లక్ష్యం చేస్తున్నాడని మండిపడ్డారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బి.తిమ్మప్ప, కృష్ణ, ఎఐటియుసి నాయకులు జె.నరసయ్య, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య



గోడ పత్రికలు విడుదల చేస్తున్న కౌలు రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వం రాష్ట్రంలోని కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 21, 21 తేదీల్లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగారెడ్డి, ఎం.బాలరంగయ్య శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా చిలకలూరి పేటలో నిర్వహిస్తున్న కౌలు రైతుల సంఘం రాష్ట్ర మహాసభలకు మహారాష్ట్ర, ఢిల్లీ రైతాంగ పోరాట నాయుకుడు, అఖిల భారత రైతు సంఘం ఉపాధ్యక్షుడు విజ్జుకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో కౌలు రైతులు 56 వేలకు పైబడి ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం కేవలం 2600 మందికి సిసిఆర్‌సి కార్డులు మాత్రమే ఇచ్చిందన్నారు. వీటిలో రైతు భరోసా రాణి వారు, బ్యాంకు రుణాలు ఒక్కరికి కూడా ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. పంట నమోదు ఈక్రా ప్ బుకింగ్, ఈకేవైసీ చేయకపోవడంతో కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం రావడం లేదన్నారు. ప్రత్యేక సర్వే ద్వారా పంట పొలాలలో కౌలు రైతులను గుర్తించి పంటల నమోదు చేయాలన్నారు. రైతు సంతకం లేకుండా ప్రభుత్వమే సిసిఆర్‌సి కార్డు ఇవ్వాలన్నారు. కౌలు రైతుల సమస్యలపై సమగ్రంగా చర్చించి ప్రభుత్వం ఆలోచించేలా ఒత్తిడి తీసుకొచ్చేందుకు మహాసభల్లో పోరాట కార్యచరణ రూపొందిస్తారని తెలిపారు. రాష్ట్ర మహాసభలకు కౌలు రైతులందరూ హాజరై జయప్రం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, వెంకటస్వామి, అశోక్, రామాంజనేయులు, వెంకటనారాయణ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద కౌలు రైతుల సంఘం 3వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య మాట్లాడుతూ మండలంలో దాదాపు 2 వేల మంది కౌలు రైతులు ఉండగా 110 మందికి మాత్రమే సిసిఆర్ కార్డులు ఇచ్చారన్నారు. సిసిఆర్ కార్డులు రాకపోవడంతో కౌలు రైతులకు రైతు భరోసా, పంట రుణాలు అందలేదన్నారు. ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ చేయకపోవడంతో కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారం రాలేదనిఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యేక సర్వే ద్వారా కౌలు రైతులను గుర్తించి పంటల నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సంతకం లేకుండా ప్రభుత్వమే కౌలు రైతులకు సిసిఆర్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈనెల 21, 22వ తేదీల్లో పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేటలో జరిగే రాష్ట్ర మహాసభల్లో నాయకులు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు కౌలు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నిర్మల, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, ఉపాధ్యక్షురాలు కవిత, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎస్.మున్ని తదితరులు పాల్గొన్నారు


ఉరవకొండ : గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించనున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం ఉరవకొండలోని ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షులు విజ్జుకృష్ణన్ హాజరవుతారన్నారు. కౌలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పరిష్కారానికి సంబంధించిన అంశాల గురించి భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం పూర్వ జిల్లా కార్యదర్శి మధుసూదన్, రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, కౌలు రైతుసంఘం నాయకులు నాగరాజు, రుద్రయ్య, బసవరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఇపిని ఉపసంహరించుకోవాలి

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

అంగన్‌వాడీలకు మంగళం పాడే ఎన్ఇపిని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని అనంత శిరిడీ సాయి కళ్యాణ మండపంలో అంగన్‌వాడీ జిల్లా 7వ మహాసభలను ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు 'ఐసిడిఎస్ పరిరక్షణ' అనే విషయంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ విద్యారంగంలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మతతత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా, దేశ అత్యున్నత చట్టసభ పార్లమెంటులో చర్చ లేకుండా కేంద్ర మంత్రులు ఏకపక్షంగా క్యాబినెట్ నిర్ణయం అంటూ ఆమోదించిన తీరు బాధాకరమన్నారు. మోడీ ప్రభుత్వం తన హిందుత్వ ఎజెండాని ముందుకు తీసుకెళ్లడానికి విద్యారంగంలో ఎలాంటి అనుభవం లేని అంతరిక్ష పరిశోధన సంస్థ మాజీఛైర్మన్ కె.కస్తూరి రంగ నేతృత్వంలో కమిటీ వేసిందని ఆరోపించారు. ప్రధానంగా పూర్వ ప్రాథమిక విద్యలో అనేక మార్పులు చేయాలన్నప్పుడు దేశవ్యాప్తంగా అంగన్వాడీ వ్యవస్థ బలంగా ఉందన్నారు. 13.42 లక్షల అంగన్వాడీ సెంటర్లలో, 26 లక్షల మంది అంగన్వాడీలు, నాలుగు కోట్ల మంది పిల్లలకు సేవలందిస్తున్నారన్నారు. వారందరి కడుపు కొట్టేందుకు నూతన విద్యా విధానాన్ని రూపొందించడం బాధాకరమన్నారు. భవిష్యత్ భవిష్యత్తులో అంగన్వాడీల భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షురాలు లలితమ్మ, సిఐటియు రాష్ట్ర నాయకులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ దిల్షాద్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షులు శకుంతల, ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, రమాదేవి, మాభూమి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



ఆర్థికసాయం చెక్కు అందజేస్తున్న విప్ కాపు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బొమ్మనహాల్ : మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదానికి గురై తీవ్ర గాయాలైన బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో పొందుతూ మృతిచెందిన పాల్తూరు లక్ష్మి కుటుబానికి విప్ కాపు రామచంద్రారెడ్డి శనివారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా ఆమె నివాసానికి వెళ్లి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిఎం జగన్ ప్రకటించిన రూ.10 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపిపి రమేష్, మేంకల్ సర్పంచి పరమేశ్వర, తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడు, కోఆపరేషన్ మెంబర్ బాషా, స్టీరింగ్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు, వైసిపి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రామకృష్ణ, యల్లప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విప్ కాపును కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఇ

రాయదుర్గం : ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇగా పదవీబాధ్యతలు స్వీకరించిన సురేంద్ర శనివారం స్థానిక ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఇ సురేంద్ర శనివారం బాధ్యతలు స్వీరించారు. ఈ కార్యక్రమంలో డి.హిరేహాల్ మండల ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ రాళ్ల తిమ్మారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి, ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ ధనుంజయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మృత్యుతీగలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

విద్యుత్ తీగలు ప్రజల పాలిట మృత్యుతీగలుగా మారుతున్నాయి. ఈవారంలో బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో చోటు చేసుకున్న విద్యుదాఘాతం ఐదుగురి ప్రాణాలను బలి తీసుకున్న విషయం తెలిసిందే. పొలం పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమైన సమయంలో విద్యుత్ తీగ తెగి ట్రాక్టర్‌పై పడటంతో దుర్ఘటన చోటు చేసుకుంది. ఇందులో ఐదుగురు మహిళా వ్యవసాయ కూలీలు మృత్యువాతపడ్డారు. ప్రభుత్వం ఎప్పటిలాగానే ఒక కమిటీని వేయడం, బాధితులకు పరిహారం చెల్లించేసింది. ఇలాంటి ఘటనే జూన్ మాసంలోనూ తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. అప్పుడే ఇదే తరహా చర్యలు తీసుకున్నారు. అయితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు మాత్రం తీసుకోలేకపోయారు. ఈ రెండు ఘటనల మధ్య కూడా మరో రెండు ఘటనలే ఇదే తీరున జరగడం గమనార్హం. అయితే వాటిల్లో ఒక్కొక్కరే మృతి చెందడంతో పెద్దగా చర్చనీయాంశమవలేదు. సాధారణ మరణాల లెక్కల్లోకే చేరిపోయారు. ప్రధానమైన విద్యుత్ లైన్లు ఈ రకంగా తెగిపడి మనుషుల ప్రాణాలు పోతుండటం ఆందోళన కలిస్తున్న అంశం. ప్రధానంగా వ్యవసాయ పంపుసెట్లకు వెళ్లే లైన్లే ఈ రకంగా తెడిపడుతున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు నాణ్యతమైన విద్యుత్ అందించే పేరుతో ప్రపంచ బ్యాంకు నిధులతో కొత్తలైన్ల ఏర్పాటు వెయ్యి కోట్లతో చేపట్టారు. ఇప్పుడు ఈ లైన్లే ఈ రకంగా తెగిపడుతున్నాయి. అయితే కొత్తగా అని వేస్తున్న ఈ లైన్లలో చాలా వరకు పాతవాటిని, నాణ్యతలేని వాటిని వాడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకే ఎంతో పటిష్టంగా ఉండే జిఐ వైర్లు చిన్నచిన్న వాటికే తెగిపడిపోతున్నాయి. అదే సమయంలో ట్రిప్ అవ్వాల్సిన వ్యవస్థ పనిచేయడం లేదు. విద్యుత్ వైరు తెగిన వెంటనే ట్రాన్సుఫార్మర్ దగ్గర లైను ట్రిప్ అవ్వాలి. కాని అవకుండా విద్యుత్ సరఫరా కొనసాగుతూనే ఉంటోంది. ఇదే ప్రమాదాలకు కారణమూ అవుతోంది. జిల్లాలో ఏడాదికి సగటున 70 వరకు ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. అంటే ప్రతి నాలుగు రోజులకు ఒక ఘటన చోటు చేసుకుంటూ ఉంది. 2029-21 లో 84 ఘటనలు, 20221-22లో 74, ఇప్పుడు ఈ ఏడాది ఇప్పటి వరకు52 ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇందులో మనుషులే కాకుండా పశువులు చనిపోతున్నాయి. పొలాల్లో తెగిపడిన తీగలకు తగిలి చనిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా నివారణ చర్యలు మాత్రం మొక్కుబడి అనే చెప్పాలి. ఎప్పుడూ వేసిన తీగలు మార్చకుండా పాతవే కొనసాగిస్తున్నారు. దీంతో తీగల్లో ఉండాల్సినంత బలం లేకుండాపోతోంది. దీంతో తెగిపడిపోతున్నాయి. ఇక వీటిని పర్యవేక్షించే వ్యవస్థనూ బలంగా లేకపోవడం మరో కారణంగా ప్రతి 600 స్తంభాలకు ఒక లైన్‌మెన్ ఉండాల్సిన చోట పది వేల వరకు ఉంటున్నాయి. దీంతో పర్యవేక్షణ క్షేత్ర స్థాయిలో చేపట్టలేని పరిస్థితి ఉంది. ఈ పనిభారం తగ్గించాల్సి ఉంది. ఏదైనా ఘటన జరిగితే క్షేత్ర స్థాయి సిబ్బందినే బాధ్యులను చేస్తున్నారు. సరైన సామగ్రి లేక, పనిభారం ఎక్కువ పెట్టి తిరిగి వారిపైనే నెపం నెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రోజురోజుకూ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. పెరుగుతున్న సంఖ్యకు అనుగుణంగా పోస్టులు పెంచకపోగా ఉన్న ఖాళీ పోస్టులే భర్తీ చేయటం లేదు. దీంతో నిర్వహణలో సమస్యలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం సమస్య మూలాన్ని గుర్తించి పరిష్కరిస్తే తప్ప ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండే అవకాశముంది. లేకపోతే సిబ్బందినే బాధ్యులను చేసి చేతులు దులుపుకుంటే పెద్దగా ప్రయోజనం చేకూరే అవకాశం లేదన్న అభిప్రాయం అంతటా వ్యక్తమవుతోంది.



పేదల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జడ్పి ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

పేదల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం వైసిపి అని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. శనివారం అనంతపురం రూరల్ పంచాయతీలో సర్పంచి ఉదయ్, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపి తలారి రంగయ్యతో కలిసి నూతనంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్, అంగన్‌వాడీ కేంద్రంతోపాటు రామకృష్ణ కాలనీలో సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మూడుసార్లు ముఖ్యమంత్రిగా పని చేసినా ఎప్పుడూ ప్రజల బాగోగుల గురించి ఆలోచించలేదన్నారు. కేవలం దోపిడీ చేయడానికే పరిమితం అయ్యారని విమర్శించారు. 2019లో జగన్ నాయకత్వంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి పనులు చేస్తుంటే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ప్రజలను మెప్పించి కాకుండా అందరూ ఏకమై జగన్‌ను గద్దెదించాలని టీడీపీ, బీజేపీ, జనసేన కుట్రలు చేస్తున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక అనంతపురం రూరల్ పంచాయతీలోనే ఏకంగా రూ.25 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూరల్ పంచాయతీ పరిధిలో ఇప్పటికే 90 శాతం రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. టీవీ టవర్, భైరవనగర్, ఆదర్శనగర్, రామకష్ణ కాలనీల్లో ఇప్పటికే రూ18.18 కోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. రాగా అనంతపురం రూరల్ పంచాయతీలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ఫ్లోరైడ్ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా సంపులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇకపోతే జిల్లాలో ఆర్డీటీ సంస్థ చేస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. రూ.18 లక్షలతో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆర్డీటీ సంస్థ నిర్మించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి వరలక్ష్మి, ఉప సర్పంచి సుమిత్ర, ఎంపిటిసిలు ఆశాజ్యోతి, ఆదినారాయణమ్మ, అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబుపై రాళ్లు రువ్వడం దుర్మార్గం

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

నందిగామలో టిడిపి అధినేత చంద్రబాబుపై కొందరు వైసిపి గూండాలు రాళ్లు రువ్వడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి ఖండించారు. శనివారం స్థానిక ఉన్నం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కార్యకర్తలు కూడా మీలాగా మాదిరిగా ఆలోచిస్తే మీ కంటే బాగా రాళ్లు వేయగలరన్న విషయం గుర్తుంచుకోవాన్నారు. తాము అనుకుంటే మీ ఎమ్మెల్యేలు గడప గడపకూ కార్యక్రమం నిర్వహిస్తారా.. అని నిలదీశారు. పోలీసులు కూడా చాలా దారుణంగా వ్యవహరిస్తున్నారన్నారు. టిడిపి నాయకులు ఏ కార్యక్రమం చేయాలన్నా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందంటారన్నారు. అదే మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశాలు, సభలు పెట్టుకుంటే వారికి 30 యాక్ట్ అమలు చేయరన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తీరు మార్చుకోవాలని, లేనిపక్షంలో తాము కూడా మీలాగే వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ సభ్యుడు ఆర్జీ శివశంకర్, మండల కన్వీనర్ డీకే రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పాపంపల్లి రామాంజనేయులు, మాజీ డీలర్ గడ్డం రామాంజనేయులు, ఉటంకి రామాంజనేయులు, జీపీ నారాయణ, మాజీ సర్పంచి గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల జాబితా సిద్ధం చేయండి

కమిషనర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నిబంధనలను ఉల్లంఘించి చేపట్టిన అక్రమ నిర్మాణాలపై జాబితా సిద్ధం చేసి సోమవారంలోపు అందజేయాలని కమిషనర్ భాగ్యలక్ష్మి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు ప్లానర్స్‌తో తన ఛాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అనధికార కట్టడాలకు జారీ చేసిన నోటీసుల సమాచారం తదుపరి చేపట్టబోయే శాఖపరమైన చర్యలపై పూర్తి నివేదికతోపాటు, నగరపాలక ఓపెన్ సైట్ల వివరాలు, వాటిని సంరక్షణకు చేపడుతున్న చర్యలపై ఆరాతీశారు. నగరపాలక సంస్థ స్థలాలను సంరక్షించాల్సిన బాధ్యత పట్టణ ప్రణాళిక, ప్లానింగ్ కార్యదర్శులపై ఉందన్నారు. అవసరమైన చోట ప్రహరీ నిర్మించాలన్నారు. కాగా అనుమతి పొందిన ప్లాన్‌కు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలు, అక్రమ కట్టడాలను వెంటనే తొలగించకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా నగరంలోని పలువార్డుల్లో భవన నిర్మాణ వ్యర్థాలు కనిపిస్తుంటే ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, ఎసిపిలు శ్రీనివాసులు, సువర్ణ, బిల్డింగ్ దుర్గాంజలి, మురళీకృష్ణ, వార్డు ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

జెఎన్‌టియు ప్రొఫెసర్ దేవకుమార్

గుత్తి : విద్యార్థులు చదువుతోపాటు ఇంటర్వ్యూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ అండ్ సీఈవో, జెఎన్‌టియు ప్రొఫెసర్ దేవకుమార్ సూచించారు. శనివారం స్థానిక గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ఇంటర్వ్యూ, సాంకేతిక నైపుణ్యాలపై దృష్టి సారించాలన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా శారీరిక, మానసిక సామర్థ్యాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే.పద్మావతమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్ అరవింద్, వైస్‌ప్రిన్సిపల్ సిద్ధేశ్వర్, ఏవో కేశవరెడ్డి, హెచ్‌ఒడి హరిప్రియ, ప్రొఫెసర్ శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

టిడిపి నేతలపై అక్రమ కేసులు దుర్మార్గం

శింగనమల : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టిడిపి నాయకులపై అక్రమ కేసులు బనాయించి వేధించడం బాధాకరమని మాజీ జెడ్పిటిసి అమ్మలదిన్నె శాలినీదొర శనివారం ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు భద్రత అధికారులపై రాళ్లు వేయడం సిగ్గుచేటన్నారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యానికి ఇది ఒక నిదర్శనమన్నారు. అదేవిధంగా టిడిపి సీనియర్ నాయకులు, మాజీమంత్రి అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు ఏతప్పూ చేయకున్నా అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. బిసిల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన వైసిపి బిసి నాయకులపైనే అక్రమ కేసులు బనాయించడం విడ్డూరంగా ఉందన్నారు. రానున్న కాలంలో సిఎం జగన్‌కు బీసీలో తగిన బుద్ధి చెబుదారన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మేయర్ వసీం

నగర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : మేయర్

అనంతపురం కార్పొరేషన్ : నగర అభివద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం నగరంలోని 39వ డివిజన్ పరిధిలో ఉన్న జన్మభూమి రోడ్ లక్ష్మీనగర్‌లో రూ.34 లక్షలతో చేపడుతున్న సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సిఎం జగన్ సహకారంతో తమ పాలకవర్గం నగరంలోని రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే అన్ని డివిజన్ల పరిధిలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సిమెంట్ రోడ్ల ఏర్పాటుతోపాటు డ్రెయినేజీలను కూడా ఏర్పాటు చేసి పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, విజయభాస్కర్‌రెడ్డి, కార్పొరేటర్ సుశీలమ్మ, ఎస్ఇ నాగమోహన్, ఎఇ శంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి లావణ్య

రాయదుర్గం : పట్టణంలోని బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలను రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి ఎన్ లావణ్య శనివారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సరఫరా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం ఆహారాన్ని రుచి చూశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన తీరును పరిశీలించారు. తర్వాత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్, న్యాయవాదులు, ప్యారాలీగల్ వాలంటీర్లు, పోలీసులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూగేతిమ్మంపల్లిలో పంటకోత ప్రయోగం

నార్పల : మండలంలోని మూగేతిమ్మంపల్లి గ్రామంలో రైతు వినోదం వెంకట్‌కుమార్ పొలంలో శనివారం పంటకోత ప్రయోగం చేశారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆధ్వర్యంలో సర్వేనెంబర్ 591/1లో నిర్ణయించిన కొలతల్లో పంటను కోసి వివరాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చంద్ర, విహెచ్ఎ కుమార్‌రాజా, రిలయన్స్ జనరల్ బీమా ప్రతినిధులు ఇస్మాయిల్, మొహమ్మద్ రఫీ, శ్రీనాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన

బుక్కరాయసముద్రం : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం అరాచక పాలనను కొనసాగిస్తోందని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు సొప్ప చంద్ర శనివారో ఒక ప్రకటనలో విమర్శించారు. మూడున్నరేళ్లలో అభివృద్ధి చేయకపోగా ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు, హత్యకు రెక్కీలు నిర్వహించడం బాధాకరమన్నారు. ముఖ్యంగా కుల,మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అంతేగాకుండా కూల్చివేతలతో ఎంతోకాలం పాలన సాగించలేరన్నారు. పవన్ కళ్యాణ్ వ్యక్తి కాదన్నారు. శక్తి అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పవన్‌కళ్యాణ్‌కు జడ్ కేటగిరి భద్రత కల్పించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

వైభవంగా తెప్పోత్సవం

పాల్గొన్న ఎమ్మెల్యే పద్మావతి, ప్రభుత్వ సలహాదారు సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-శింగనమల

మండలం కేంద్రంలోని రంగరాయల చెరువులో గోల్కొండ వేంకటరమణస్వామి, సీతారాములస్వామి తెప్పోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎపి ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన తెప్పోత్సవంలో స్వామవారు విహరించారు. తర్వాత చెరువులో బోటు పందెం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ డైరక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువనాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, మండల కన్వీనర్ కట్టుం నగేష్, చెరువు ఆయకట్టు ప్రెసిడెంట్ గోవింద్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, బెస్త సంఘం ప్రెసిడెంట్ వెంకటనారాయణ, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనంతపురం : శ్రీచైతన్య విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ ఝాన్సీ లక్ష్మీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఐఆర్‌సిఎస్ సంయుక్తంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు అనంతపురం జోన్ విద్యాసంస్థల ఎజిఎం సుబ్బారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలోని కమ్మభవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వెలుగు సీసీ సురేష్ హత్య కేసు ఛేదింపు

డీఎస్పీ శ్రీనివాసులు



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అనంతపురం : అనంతపురం శివార్లలో వారంరోజుల కిందట జరిగిన వెలుగు సీసీ సురేష్ హత్య కేసును త్రీటౌన్ పోలీసులు ఛేదించి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు తెలిపారు. ఎస్పీ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు శనివారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతనెల 28న వెలుగు సీసీ బి.సురేష్ హత్యకు గురి కావడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. తన పర్యవేక్షణలో త్రీటౌన్ సి.ఐ కత్తి శ్రీనివాసులు, ఎస్సైలు రంగడుయాదవ్, వలిబాషా, జయపాల్‌రెడ్డి, టెక్నికల్ ఎస్ఐ సుధాకర్‌యాదవ్, ఎఎస్ఐ చౌదరి, హెడ్‌కానిస్టేబుళ్లు శివయ్య, శ్రీధర్ కానిస్టేబుళ్లు రాజేంద్ర, మహేష్, పాండవ, దాసు, ఆసీఫ్, యాసర్, కిరణ్ (టెక్నికల్ స్టాఫ్), శీనా నాయక్, రమణ, బాబయ్యలు బందంగా ఏర్పడి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సురేష్ తన సహచర ఉద్యోగితో కలిసి రాజీవ్ కాలనీ సమీపంలోని కాఫీ క్లబ్‌కు వెళ్లాడు. కాఫీ తాగిన తర్వాత బి.సురేష్ ఒక్కడే నేషనల్ హైవే దాటి రాజీవ్ కాలనీకి వెళ్లే సర్వీసు రోడ్డులో తన ద్విచక్ర వాహనం ఆపి ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో జులాయిగా తిరిగే ఎంజి కాలనీకి చెందిన బి.సాయికిరణ్, రాజీవ్‌కాలనీకి చెందిన కె.రేణుకుమార్ అటుగా వచ్చి రోడ్డుపై అడ్డం పెట్టాడని సురేష్‌తో గొడవకు దిగారు. గొడవ పెరిగి హెల్మెట్‌తో తలపై కొట్టడంతో సురేష్ చనిపోయాడు. ఈనేపథ్యంలో అందిన సమాచారం మేరకు విచారణ చేపట్టగా నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా సిఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఛేదించినట్లు తెలిపారు.

పెద్ద కొట్టాలపల్లిలో విషాదం..

ఉదయం అవ్వ మృతి..మధ్యాహ్నం రోడ్డు ప్రమాదంలో మనవడు దుర్మరణం

ప్రజాశక్తి-ఉరవకొండ



మృతిచెందిన వంశీ

విడపనకల్ మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లిలో శనివారం నాడు విషాధ ఘటన చోటు చేసుకుంది. ఉదయం అవ్వ మృతి చెందగా ఆమె అంత్యక్రియలకు ఏర్పాట్లు చేసేందుకు వెళ్తున్న మనవడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో ఆ ఇంట్లో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.... పెద్దకొట్టాలపల్లి గ్రామానికి చెందిన భోగాల మల్లికార్జున తల్లి యల్లమ్మ(90) వయో భారంతో శనివారం వేకువజాము మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు సంబంధించి ఇంటి వద్ద షామియానాలను విడపనకల్లు నుంచి తీసుకురావడానికి మల్లికార్జున కుమారులు వంశీ, చిన్నలతో పాటు వారి బంధువులు నలుగురు ఆటోలో వెళ్లారు. షామియానాలు తీసుకుని మాలాపురం గ్రామం వద్దకు రాగానే ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో భోగాల వంశీ(19)కి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆటోలో ఉన్న మరో నలుగురు చిన్న, సురేష్, రామాంజనేయులు, ఈశ్వర్‌లు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే వీరిని చికిత్స నిమిత్తం విడపనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వంశీ(19) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన నలుగురికి ప్రథమ చికిత్సలు చేసి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మతి చెందిన వంశీ మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నారాలోకేష్‌ను కలిసిన రసూల్



నారాలోకేష్‌కు పుష్పగుచ్చం అందజేస్తున్న మైనారిటీ నాయకుడు రసూల్

అనంతపురం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను రాజీవ్ కాలనీ పంచాయతీ టిడిపి మైనార్టీ నాయకులు రసూల్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాడాలని నారాలోకేష్ సూచించినట్లు రసూల్ తెలిపారు. అంతేగాకుండా మైనార్టీ సెల్ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు శక్తి వంచన లేకుండా పోరాడాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు.

రాజేంద్ర ఉన్నత పాఠశాలలో డిఇఒ తనిఖీ

అనంతపురం : నగరంలోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఇన్‌ఛార్జి డిఇఒ వెంకటకృష్ణారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో చేపట్టిన నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నుంచి అందే జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, ఇతర పథకాలపై ఆరాతీశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూఉపాధ్యాయుల ముఖ హాజరును ఫేషియల్ యాప్‌లో సమయానికి వేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడూ లేసెన్ ప్లాన్ రాయాలన్నారు. సమయానికి పాఠశాలకు హాజరుకావాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని, డ్రాపౌట్స్ సంఖ్య తగ్గించాలని, ప్రతి పిల్లవాడూ పాఠశాలకు విధిగా వచ్చే విధంగా టీచరు చొరవ చూపాలని సూచించారు. అదేవిధంగా చైల్డ్ అబ్యూసింగ్‌కు సంబంధించి కంప్లైంట్ బాక్సును కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల రాయితీని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎడిహెచ్ నరసింహారావు

బుక్కరాయసముద్రం : రైతు సంఘాల ద్వారా ఉద్యాన పంటలకు వచ్చే రాయితీని రైతులు ఉపయోగించుకోవాలని ఉద్యానశాఖ ఎడిహెచ్ నరసింహారావు సూచించారు. శనివారం మండలంలోని పసలూరు గ్రామంలో ఉద్యాన శాఖ ద్వారా రైతు రామచంద్రారెడ్డి సాగు చేసిన అంజురా పంటను పరిశీలించారు. అనంతరం అంజూరా సోలార్, డ్రైయింగ్ యూనిట్, సోలార్ కోల్డ్ రూమును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యాన పంటల కోత అనంతరం పంట ఉత్పత్తి నిల్వ చేసే శీతల గిడ్డంగులు, రైపనింగ్ ఛాంబర్, కోల్డ్ రూములు, రీఫర్ వాన్, కలెక్షన్ సెంటర్ల ఏర్పాటుకు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి శైలజ, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



బహుమతి పొందిన విద్యార్థులతో పద్మవాణి పాఠశాల కరస్పాడెంట్ కరస్పాండెంట్ నాగపీరయ్య

తాడిపత్రి : పట్టణంలోని పద్మావాణి హైస్కూల్లో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 'అవినీతి నిరోధము భారతదేశ అభివద్ధి' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో విజేదలకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులను ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్ జ్యోతి అందజేశారు. ఈ కార్యక్రమంలో పద్మావాణి పాఠశాల కరస్పాడెంట్ నాగపీరయ్య, ప్రధానోపాధ్యాయులు జయచంద్రారెడ్డి, గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్ దాసు, మహబూబ్‌బాషా, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.